క్లుప్తంగా

పైడితల్లికి చల్లదనం



అమ్మవారికి చల్లదనం చేస్తున్న మార్వాడీ భక్తులు

విజయనగరం టౌన్: నగరంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో కొలువైన పైడితల్లికి మార్వాడీలు శుక్రవారం చల్లదనం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నేతేటి ప్రశాంత్ మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

చీడపీడలపై అప్రమత్తం

పూసపాటిరేగ: చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలని డిజిటల్ గ్రీన్‌సంస్థ కో ఆర్డినేటర్ కమలాకర్ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో పైడితల్లమ్మ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీడపీడల కారణంగా రైతులు నష్టపోతున్నారన్నారు. ఫార్మర్‌చాట్ యాప్ ద్వారా రైతులు ఏయే సమయాల్లో ఎంతమేర ఎరువులు వాడాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రేడ్స్ కో ఆర్డినేటర్ శివ, కిసాన్ ఎఫ్‌పీఓ సీఈఓ అప్పలాచారి, పైడితల్లమ్మ ఎఫ్‌పీఓ అధ్యక్షుడు దొర, ప్రజాప్రతినిధులు మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, పబ్బిరెడ్డి అప్పడుదొర పాల్గొన్నారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. వెండి మండపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఉంచి, దీపారాధన చేశారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్లలో ఆక్రమణలు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్

నెల్లిమర్ల: పట్టణంలోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జోరందుకున్నాయి. మొన్న చంద్రబాబు కాలనీ సర్వే నంబర్ 60లో ఆక్రమణలకు పాల్పడితే తాజాగా సర్వే నంబర్ 74లో ఆక్రమణలకు తెరతీశారు. కూటమి నాయకుల అండతో కొంతమంది ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఈవీఎం గొడౌన్‌కు ఎదురుగా గురువారం రాత్రి ఓ కంటైనర్ వెలిసింది. పట్టణంలో ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోకి మారడంతో డాక్యుమెంట్ రైటర్లుఈ రహదారిలోనే అద్దెకు వచ్చారు. ఈ క్రమంలో ఒకరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంటైనర్ ఏర్పాటు చేశారు. దీన్ని తొలగించకుంటే మరికొన్ని ఆక్రమణలు రిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై తహసీల్దార్ సుదర్శనరావు వివరణ కోరగా.. స్థల పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ సుదర్శనరావు




రామతీర్థంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ


నెల్లిమర్ల రూరల్: భూముల రీ సర్వేతో ఏళ్ల కాలం నుంచి ఉన్న రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ సుదర్శనరావు అన్నారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో రీ సర్వేపై శుక్రవారం అవగాహన ర్యాలీతో పాటు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల రీసర్వే కార్యక్రమం రైతులకు వరం లాంటిదన్నారు. పేర్ల నమోదులో తప్పులు, భూ వ్యత్యాసాలు, సరిహద్దుల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సర్వే చేసినప్పుడు రైతులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్. సత్యనారాయణ, మండల సర్వేయర్ దివ్యమానస, గ్రామ పెద్దలు కంచరాపు రాము, సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు..

- ఎండల నేపథ్యంలో వడదెబ్బ తగిలే అవకాశం
- జాగ్రత్తలు తప్పనిసరి
- డీఎంహెచ్‌ఓ జీవనరాణి



విజయనగరం ఫోర్ట్: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందని తెలిపారు. దీని వల్ల మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం దెబ్బతిని వడదెబ్బకు గురవుతారన్నారు. దీనినే హీట్ స్ట్రోక్, సన్ స్ట్రోక్ (వడదెబ్బ) అంటారని తెలిపారు. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, కలవరింతలు, పాక్షికంగా అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలని తెలిపారు.



వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- తెలుపు రంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ, రుమాలు గాని వాడాలి. లేదంటే గొడుగు వేసుకోవాలి.
- వేడిగాలులు తగలకుండా చూసుకోవాలి.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేయకుండా ఉండాలి.
- దూర ప్రయాణాలు చేసేవారు ఉదయం 10 గంటల్లోపు గాని, సాయంత్రం 4 గంటల తర్వాత గాని ప్రయాణాలు పెట్టుకోవాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఒక గ్లాసు మంచినీరు తాగాలి.
- ఎండలో తిరిగే సమయంలో మంచినీరు వెంట తప్పనిసరిగా ఉంచుకోవాలి.
- ఎండ తీవ్రంగా ఉండేటప్పుడు పిల్లలు, వయో వృద్ధులు, గర్భిణులు బయట తిరగకూడదు.
- మద్యపానం, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి.
- మాంసాహారం భుజించడం వీలైనంతవరకు తగ్గించుకోవాలి.

నీడలో ఉంచాలి...



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకెళ్లాలి. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తూ ఉండాలి. చల్లని గాలి తగిలేలా చూడాలి. డీహైడ్రేషన్ రాకుండా ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

– జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

పరామర్శ





జడ్పీ చైర్మన్ మంచి శ్రీనివాసరావు చిన్న కుమారుడు ప్రణీత్ బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విజయనగరం: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును పలువురు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల జెడ్పీ చైర్మన్ చిన్న కుమారుడు ప్రణీత్ మృతి చెందిన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఆయన ఇంటికెళ్లి పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.పరామర్శించిన వారిలో మాజీ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ మాజీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు బద్దుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, అలజంగి జోగారావు, శంబంగి చినప్పలనాయుడు నాయుడు, శాసనమండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు తలే రాజేష్, చినరామనాయుడు, వర్రి నరసింహమూర్తి, గేదల సన్యాసినాయుడు, తదితరులున్నారు.

సీపీఎం పోరాటంతోనే ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

- సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు

విజయనగరం గంటస్తంభం: సీపీఎం చేసిన పోరాటాల వల్లే ప్రభుత్వం స్పందించి హుద్‌హుద్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి మీటర్ రిజిస్ట్రేషన్లు ప్రారంభించారని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఈ మేరకు హుద్‌హుద్ కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లంకాపట్నంలోని హుద్‌హుద్ కాలనీలో మౌలిక వసతులు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారన్నారు. దీంతో సీపీఎం పోరాటం ప్రారంభించగా.. అధికారులు విద్యుత్, తాగునీరు సౌకర్యాలు కల్పించారన్నారు. అలాగే ఈ నెల 18న స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సీపీఎం ఆధ్వర్యంలో ముట్టడించడంతో అధికారులు స్పందించి ఇళ్ల మీటర్లకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పి.రమణమ్మ, బి.రమణ, రంభ శ్రీనివాస్, వెంకటరావు, తోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ తుంపల్లి జనార్దనారావు తెలిపారు. పట్టణంలోని గాయత్రి ఆస్పత్రిని శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించినా.. అదనంగా డబ్బులు అడిగినా.. ఆరోగ్యమిత్రకు తెలియజేయాలని రోగులను సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర రమాదేవి పాల్గొన్నారు.

పీ 4 సర్వేతో మెరుగైన భవిష్యత్

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: పేదరిక నిర్మూలనకు, మెరుగైన భవిష్యత్‌కు పీ 4 సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులు, ప్రత్యేక సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పీ 4 సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. పూర్తి స్థాయి వివరాలు సేకరించి నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

జాబితాల ప్రదర్శన..

విజయనగరం: నగరంలో ఇంతవరకు చేపట్టిన పీ 4 సర్వే వివరాలను శుక్రవారం అన్ని సచివాలయాలలో ప్రదర్శన నిమిత్తం ఏర్పాటు చేశారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో సచివాలయాల కార్యదర్శులు జాబితాలను ప్రదర్శించారు.

పేదరిక నిర్మూలన..

నెల్లిమర్ల: పీ 4 సర్వేతో పేదరిక నిర్మూలన జరుగుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేట, గాంధీనగర్ కాలనీ, మొయిద జంక్షన్ సచివాలయాలలో పీ 4 కార్యక్రమంపై వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన 20 శాతం కుటుంబాలకు సహాయం చేయడమే సర్వే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, మెప్మా సీఎంఎం దన్నాన గోవింద, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్ జనా సంధ్యారాణి, మొయిద శ్రీనివాసరావు, కింతాడ కళావతి, నాయకులు ఎంఎం నాయుడు, ముడిమంచి లక్ష్మణరావు, పైల మురళి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

సహజ వనరులను కాపాడుకోవాలి



వెబ్‌నార్ ద్వారా అవగాహన కల్పిస్తున్న విశ్రాంత జీఎం కేపీ మూర్తి

నెల్లిమర్ల రూరల్: సహజంగా ప్రకృతిలో లభించే వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బోష్ లిమిటెడ్ విశ్రాంత జనరల్ మేనేజర్ కేపీ మూర్తి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులకు వెబ్‌నార్ ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు, పెట్రోలియం, గ్యాస్ వంటి వనరులకు బదులుగా ప్రత్యామ్నాయ వనరులను ఉపయోగిస్తే మనుషుల జీవిత కాలం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యం, నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన నీరుతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించండి

- సీఐటీయూ నగర అధ్యక్షుడు జగన్ మోహనరావు



ఉపాధి వేతనదారులతో సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ఉపాధి వేతనదారులకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ. జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు దుప్పాడ పంచాయతీ చిల్లపేట గ్రామ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో కాసేపు మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రారంభించి 14 రోజుల్లో కూలీలకు డబ్బు చెల్లించాలని, పే స్లిప్ ఇవ్వాలని చట్టం చెబుతుంటే.. ఇక్కడ మాత్రం ఎనిమిది వారాలు గడిచిన ఇంతవరకు బిల్లులు చెల్లించలేదన్నారు. ఎండల నేపథ్యంలో ఒక పూట మాత్రమే పనులు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధి హామీ వేతనదారులు, మేట్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

27న ఉపసర్పంచ్ ఎన్నిక

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఆగస్టు 26న ఉప సర్పంచ్ బడుకొండ రామ్మోహన్ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైందని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల అధికారిగా గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ మహమ్మద్ హిదాయత్ పాషాను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్వర్వులిచ్చిందని పేర్కొన్నారు.

బీపీఎం స్కూల్ టీచర్‌పై విచారణ

విజయనగరం అర్బన్: ఇటీవల సస్పెండైన బీపీఎం ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ టీచర్ ఎం.హరిపై విద్యాశాఖ ఎ.డి బి.గౌరీశంకరరావు పాఠశాల ప్రాంగణంలోనే శుక్రవారం విచారణ చేపట్టారు. భార్యాభర్తల మధ్య వివాదంతో పాటు వివిధ ఆరోపణలపై స్థానిక పోలీసులు అరెస్ట్ చేయడంతో పాటు 48 గంటలకు పైగా జైలులో ఉండడంతో ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆయన భార్య కూడా విద్యాశాఖకు ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ చేపట్టామని ఎ.డి గౌరీశంకరరావు ఈ సందర్భంగా తెలిపారు. ఫిర్యాదుదారిని కూడా విచారించామని, నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తానని తెలిపారు. విచారణలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.విశాలాక్షి పాల్గొన్నారు.

నేడు నగర పాలక సంస్థ సమావేశం

విజయనగరం: నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నగర మేయర్ విజయలక్ష్మి సమక్షంలో కార్పొరేషన్ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలన్నారు.

నేడు మెడికవర్‌లో ఉచిత వైద్యశిబిరం

విజయనగరం ఫోర్ట్: తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎం.డి డాక్టర్ కె. తిరుమలప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ ఆర్. దుర్గాసాయికుమార్ రూ.8 వేల విలువ చేసే ఫైబ్రోస్కాన్ పరీక్షను ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ పరీక్ష చేయించుకోదలిచిన వారు నాలుగు గంటల ముందు నుంచి ఏమీ తినకూడదని సూచించారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు



పట్టణంలోని బొడ్డువారి వీధిలో ఉన్న మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎ.డి రజిత

విజయనగరం ఫోర్ట్/క్రైమ్: పట్టణంలోని పలు మందుల దుకాణాల్లో ఔషధ నియంత్రణ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఫార్మసిస్టులు ఉన్నారా, లేదా?.. దుకాణంలో విక్రయించే మందులు నాణ్యమైనవా, కావా ?.. మందుల విక్రయాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. తనిఖీలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు కొనసాగాయి. ఔషధ నియంత్రణశాఖ ఎ.డి రజిత, విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు.

స్వర్ణ పుష్పాలంకరణలో పైడితల్లి..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి స్వర్ణ పుష్పాలతో పూజాధికాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

– విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి..



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మండల విద్యాశాఖాధికారి-2 శ్రీరాములుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్మికులకు 12 నెలల పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్కర్లకు రూ.26 వేల జీతం చెలించాలని, మెనూ చార్జీలు రూ.20 పెంచాలని కోరారు. కార్మికులకు అపాంట్‌మెంట్ లెటర్, గుర్తింపు కార్డు, రెండు జతల యూనిఫారాలు ఇవ్వాలన్నారు. రూ.5 లక్షల ప్రమాద బీమాతో పాటు ఆరోగ్య బీమా, ప్రసూతి సెలవులు కల్పించాలన్నారు. సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

– డెంకాడ

అభినందనలు



వేణును అభినందిస్తున్న పార్టీ నాయకులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం నగర అధ్యక్షుడిగా మరోమారు ఎన్నికైన ఆశపు వేణుకు అభినందనలు వెల్లువెత్తాయి. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. ఈ మేరకు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు (రాజేష్) సమక్షంలో పార్టీ కార్పొరేటర్లు ఆశపు వేణును శుక్రవారం సాయంత్రం కలిసి అభినందించారు.

మరింత మెరుగ్గా ఆర్టీసీ కార్గో సేవలు

- డిప్యూటీ చీఫ్ మేనేజర్ (కమర్షియల్) అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ మేనేజర్ (కమర్షియల్) అప్పలనాయుడు

విజయనగరం అర్బన్: వినియోగదారులను ఆకట్టుకునే విధంగా ఆర్టీసీ కార్గో సేవలను మరింత మెరుగుపరచాలని సిబ్బందికి డిప్యూటీ చీఫ్ మేనేజర్ (కమర్షియల్) బి.అప్పలనాయుడు ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న కార్గో సేవల పార్సిల్ సర్వీస్ కౌంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పార్సిల్ రవాణా రంగం కంటే ఆర్టీసీ కార్గో విభాగం మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏటీఎం దివ్య, డీఎంఈ రాజు, శ్రీనివాస్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో రేడియాలజీ విభాగం విద్యార్థులు రొమ్ము క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు యోషితా శ్రీన్, ఇందుపల్లవి, జాహ్నవి మాట్లాడుతూ.. దేశంలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పేదరికం, అనియంత్రిత జీవన శైలి రొమ్ము క్యాన్సర్‌కు ప్రధాన కారణమన్నారు. జన్యుపరంగా కూడా వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని చెప్పారు. రొమ్ము చర్మంలో మార్పులు, చనుమొనల్లో మార్పులు, రొమ్ములో నొప్పి, గడ్డలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

- మైలాన్ పరిశ్రమ కార్మికులు



మైలాన్ పరిశ్రమగేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాబ్రికేషన్ ఎన్ఎంఆర్ కార్మికులు

పూసపాటిరేగ: కార్మికులను మోసం చేసిన మైలాన్ పరిశ్రమ (టియానిష్ లేబొరేటరిస్) ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్టర్ దిలీప్‌పై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని గైతులచోడవరం మైలాన్ పరిశ్రమలో పనిచేస్తున్న వారిని తొలగించడంతో శుక్రవారం వారంతా పరిశ్రమ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా పని చేస్తున్న 76 మంది ఫ్యాబ్రికేషన్ కార్మికులకు చెందిన పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము కాజేసిన దిలీప్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు నెలలుగా పని లేకపోవడంతో కుటుంబాలతో రోడ్డున పడ్డామని వాపోయారు. దీనిపై హెచ్‌ఆర్ మేనేజర్ మాధవరెడ్డి మాట్లాడుతూ.. కార్మికులను మోసం చేసిన కాంట్రాక్టర్‌పై ఇప్పటికే చర్యలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కార్మికసంఘ ప్రతినిధులు ఎస్. సూర్యప్రభాకర్, జె. సూరిబాబు, ఎ.మధు, ఈ. సత్యనారాయణ, ఈ. రాము, యు. సూర్యారావు, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా వాహనాలు

- హీరో మోటార్ కార్ప్స్ జోనల్ హెడ్ సురేష్ ఆర్ముగం



హీరో వాహనాల కార్నివాల్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న జోనల్‌హెడ్ సురేష్ ఆర్ముగం, ఎంపీపీ కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా హీరో సంస్థ ద్విచక్ర వాహనాలను రూపొందిస్తోందని హీరో కార్ప్స్ జోనల్ హెడ్ సురేష్ ఆర్ముగం అన్నారు. శుక్రవారం స్థానిక కోనాడ జంక్షన్‌లో గల శ్రీలక్ష్మి షోరూం అధినేత కందికుప్ప చినబాబు ఏర్పాటు చేసిన మెగా సర్వీస్ కమ్ సేల్స్ కార్నివాల్‌ను ఎంపీపీ మహంతి కల్యాణితో కలిసి ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగాఆర్ముగం మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా హీరో సంస్థ వాహనాలను డిజైన్ చేస్తోందని చెప్పారు. మొదటి రోజు మేళాకు మంచి స్పందన లభించిందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సెకండరీ లీడ్ హెడ్ మనోరంజన్ జేన, ఏరియా మేనేజర్ మహేంద్రన్ పెరుమాల్‌స్వామి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, రౌతు స్వామినాయుడుతో పాటు హీరో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

విజయనగరం అర్బన్: పట్టణంలోని వికాస ఏజీఎల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి 400 మంది అభ్యర్థులు మేళాలో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ సి.రామచంద్రరావు తెలిపారు. తుది ఎంపికలో 204 మంది ఉద్యోగాలను సాధించారని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో కళాశాల డైరెక్టర్ సీర రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.